సహాయం

"మే ఐ కమిన్?"

తలుపు సగం తెరిచిన బలమైన చెయ్యి. ఆ గొంతులో అభ్యర్థన కాదు వినిపించింది. గభాలున తన ఖరీదైన రివాల్వింగ్ కుర్చీలోంచి లేచి నిలబడి 'రండి రండి' అన్నాడు రాంజీ. తమకన్న పవరో డబ్బో ఉన్నవాళ్ళు వస్తేతప్ప ఇవ్వని ఆ స్వాగతం ఇతనికి ఇవ్వడంలో ఈ రోజు రాంజీలో తటపటాయింపు లేదు.

ఆ ఆహ్వానంలో 'దయచేసి రండి' అన్న ఆదరపూర్వకమైన మర్యాద ఉన్నది.

మెత్తటి కార్పెట్ దాటుకుంటూ వచ్చాడు అతను - సిద్ధార్థ. ముప్ఫైఏళ్ళవ్యక్తి కొంచెం నలిగిన ప్యాంటు, బనియన్.

జీవితంలో పోరాటం తెలిసిన వ్యక్తిలో ఉండే కొరకంచు ఆవేశం అతనిలో కనబడడం లేదు.

అతని కళ్ళలో "మెరుపు" తప్ప "అలుపు" లేదు. కారణం అతని సటిలిటీ. అతని మీద అతనికే అంతర్లీనమైన గౌరవం. తనను గురించి తనకు తెలిసిన వ్యక్తి తాలూకు నిశ్శబ్ద స్వప్నంలా ఉన్నాడతను.

"కూర్చోండి సిద్ధార్థా వాట్ కెన్ ఐ డు ఫర్ యూ? ఆత్రంగా అడిగాడు రాంజీ.

సిద్ధార్థ నవ్వాడు. నాకు ఏదో చెయ్యడం ద్వారా నాకు నువ్వు చాలా చేసుకుంటున్నావు అన్న అర్థం ధ్వనించింది రాంజీకి ఆ నవ్వులో. ఉలిక్కిపడ్డాడు.

"రాంజీగారూ! మీరు నాకేం చెయ్యొద్దు. ఇది నా ప్రాజెక్ట్. దీన్ని ఫిలిమ్‌గా మార్చడానికి మీ సహకారం కావాలి" అన్నాడు సిద్ధార్థ.

రాంజీ లేచి గ్లాసులో డ్రింక్ పోశాడు. సిద్ధార్థకు ఇచ్చాడు. కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. తెల్లటి ఆకాశాన్ని, దాన్ని ఒక శకలంగా మాత్రమే కనబడేటట్లు చేస్తున్న తన తండ్రి పది అంతస్తుల కాంప్లెక్సును చూశాడు.

అందులో ఒక బ్లాక్‌లో సగం ఖరీదు కూడా చెయ్యదు సిద్ధార్థకు కావలసిన సహకారం.

కానీ... కానీ తనలాంటి వ్యాపారస్తుడు. తండ్రి తర్ఫీదు పూర్తిగా పొందిన పక్కా బిజినెస్‌మ్యాన్ ఇది చెయ్యడు. కారణం ఫ్లాట్‌మీద పెట్టిన డబ్బు పిల్లలు పెడుతుంది. సెక్యూరిటీ ఉన్నది. సెల్యులాయిడ్ మీద పెట్టిన డబ్బు నమ్మలేం. అందులో ఎంత మెసేజ్ ఉన్నా, ఎంత గొప్పగా తీసినా, ఆలోచించడం చేతగానివాళ్ళు, ఆలోచించేందుకు భయపడేవాళ్ళు, అర్థంకానివాళ్ళు దానికి

'బాగాలేదు' అని ముద్రవేస్తే? అది చాలు. ఆ మిగిలిపోయిన ఫిలిమ్ ముక్కలతో బాయిలర్‌లో నీళ్ళుకూడా కాగవు.

అదే అన్నాడు మూడు నెలల క్రితం తండ్రి.

"వాడెవడో వాడికి కలలు, విజన్ ఉంటే సరిపోదురా! కమర్షియల్ కల ఉండాలి. ఆలోచన రూపాయలుగా కనబడాలి. లేదనుకో. ఆ పిచ్చి వెధవను నమ్మితే మనకు మిగిలేది మట్టే. వాడి సబ్జెక్టు గొప్పగా ఉన్నది అనకు. అంతకన్న గొప్ప సబ్జెక్ట్ డబ్బిచ్చి పండించగలను. విషయం చెప్పా. వీడి పేరు చెబితే ఎవరు, ఎవరు కొంటారు? వీడికి సర్కిల్ ఏది? లౌక్యం తెలిసిన పాపులర్ మనిషి పేరు వేసుకోమను. డైరెక్ట్ చేయించమను. అనవసరంగా ఎవడో స్నేహితుడు చెప్పాడని కమిట్ అయిపోకు. అర్థమైందా?"

ఇది మూడు నెలలక్రితం తండ్రి ఇచ్చిన వార్నింగ్. అందులో ప్రతి అక్షరంలోనూ పచ్చినిజం ఉన్నదని నమ్మాడు రాంజీ.

అందుకే. "చాలా స్పార్క్ ఉన్న కుర్రాడురా! సహాయం చెయ్యగలవేమో చూడు" అని ఒక స్నేహితుడు సిద్ధార్థ గురించి చెప్పినప్పుడు తండ్రి "ఒద్దు" అనగానే, "సారీ ఫ్రెండ్" అని అనెయ్యగలిగాడు. ఆ విషయం పూర్తిగా మర్చిపోయాడు. కానీ, ఇప్పుడు అతణ్ణి రమ్మనమని తానే కబురు పంపించాడు. కారణం? ఈ తొంభై రోజుల్లో చాలా చాలా జరిగింది.

❀ ❀ ❀

భోగి పండుగ రోజున రాంజీ చెల్లెలు జ్యోత్స్న అత్తవారింటి నుంచి పుట్టింటికి వచ్చింది. అది శుభసూచకమే. కానీ, "మళ్ళీ వెళ్ళను" అన్నది.

ఆ పిల్లను పరీక్షగా చూస్తే తమ బాబాయి కూతురికి ఉన్నట్లు ఒంటిమీద పంటిగాట్లు, సిగరెట్టు వాతలు లేవు, బెల్ట్ దెబ్బలు లేవు. ఉలికివచ్చే ఏడుపు లేదు. చేతికి ఉండే రవ్వల గాజు, ఖరీదైన బిన్నీ సిల్క్ చీర, బ్యూటీ పార్లర్ తయారుచేసిన సౌందర్యం చెక్కు చెదరలేదు.

డబ్బున్న ఇంటి బంగారు చిలక. మరో బంగారు పంజరంలోకే పంపారు మరి.

"నేను వెళ్ళను. అక్కడ, అక్కడ ఏదో లేదు అన్నయ్యా! ఇది... ఇది అని చెప్పడం నాకు రావడంలేదు" అని భోరున ఏడ్చినప్పుడు ఇంట్లో ఎవరికీ అర్థంకాలేదు.

ఆడబడుచు అలా "ఇక్కడే ఉండిపోతాను" అనడం ఆవిడ అధికార దర్పానికి ఒక ఎదిరింపు అనిపించింది. తండ్రి తాలూకు నియంత సామ్రాజ్యంలో అనారోగ్యంతో, పక్షవాతంతో, గర్భకోశంలో ఫైబ్రాయిడ్స్‌తో, భయంలోనో, బాధలోనో బతికిన తల్లి కూతురి ఆక్రోశం అర్థమైనా బయటకు చెప్పదు. కారణం, తన మాట చెల్లదు కాబట్టి.

జ్యోత్స్న మామగారి బిజినెస్‌లో ఆమె తండ్రి పార్ట్‌నర్. అంత మంచి "బిజినెస్ రిలేషన్‌షిప్"ను కేవలం కూతురు అర్థం లేని బాధకు విలువ ఇచ్చి పోగొట్టుకోడు తండ్రి.

అందుకే, "సర్దుకుపోవాలమ్మా, ఆడదానివి కదా!" అని ఓదార్పుగా అన్నాడు.

"నావల్లకాదు నాన్నా! ఆ మానసిక హింస, ఆ అమర్యాదలు...." ఏదో మాట్లాడబోయింది దురుసుగా జ్యోత్స్న.

బరబర ఏ.సి రూమ్‌లోకి లాక్కుని వెళ్ళాడు. "నీకు అటువంటి మంచి సంబంధం తేవడానికి నా పెట్టుబడి ఎంతో తెలుసా? వాళ్ళ బిజినెస్‌లో షేర్లు, నగలు, సారె, పెళ్ళి ఖర్చు.... అంతా కలిపి డెబ్బై అయిదు లక్షలు! నువ్వేమన్నా సాహసం చేస్తే వచ్చే నష్టం ఎంతో తెలుసా? కొన్ని కోట్లు! ఎ(ర ఏగాని సంపాదించడం చాతకాని ఆడదానివి నీకేం తెలుసే డబ్బు విలువ? నోరు మూసుకుని పడి ఉండు."

ఆ మాటలు అనేటప్పుడు అతనిలో తండ్రి కనబడలేదు. వ్యాపారవేత్త కనబడ్డాడు. తన పెళ్ళి 'ఖరీదైన అగ్రిమెంట్!' తనకు దాన్ని చించేసే అధికారం లేదు.

మర్నాడు, బొట్టు పెట్టి, పసుపు రాసి, తాంబూలం ఇచ్చి, ఖరీదైన చీరపెట్టి రాంజీ భార్య చూసిన చూపులో, "వెళ్ళిరా, ఎప్పుడు వచ్చినా వెళ్ళిపోవాలి. అప్పుడే మళ్ళీ రాగలవు" అన్న అర్థం ధ్వనించింది.

"తిరిగి వెళ్ళిపో" అన్న ఆ బంతిపూవులు కట్టిన పెద్ద ముగ్గుల గడప పంపించివేసింది ఆ ఇంటి ఆడపడుచును, పండగపూట. వెళ్ళిపోయింది జ్యోత్స్న కన్నీళ్ళు తుడుచుకుంటూ.

❀ ❀ ❀

ఆ మర్నాడు రాంజీ ఆఫీసుకు వచ్చింది జ్యోత్స్న.

"అన్నయ్యా! నాకు బతకాలని లేదు" అని భోరున ఏడ్చింది. ఆమె దిగివచ్చిన హోండా కారు. ఆమె అలంకరణ. ఏ.సి రూమ్‌లో ఆ నీలి జిలుగుల మధ్య అర్థం లేని ప్రవచనంలా ఉన్నాయి ఆమె మాటలు.

"చాలామంది గంజిలో ఉప్పు లేక ఏడుస్తుంటే, నీలాంటివాళ్ళు పాయసంలో ఏలకులు ఎక్కువయ్యాయని ఏడుస్తున్నారు. ఆలోచించుకో. పనిలేక డబ్బున్న కష్టాలు ఊహించుకోకు. ఆ డబ్బు లేనివాళ్ళ బాధలముందు నువ్వెంత? బంగారు తల్లివి కదూ! కొంచెం అడ్జస్ట్ అవ్వాలి" అని మెత్తటి మాటలతో ఓదార్చాడు.

జోక్స్ చెప్పాడు.

ఇద్దరూ నవ్వుకున్నారు.

ఫైవ్‌స్టార్ హోటల్ నుంచి లంచ్ తెప్పించుకుని అక్కడే తిన్నారు ఇద్దరూ. హాయిగా కబుర్లు చెప్పుకున్నారు.

మనిషిలో తమాషా అదే. వినబడని దుఃఖం ఎదుటివాళ్ళకు అర్థం కానప్పుడు చెప్పడం మానేస్తాము. మానసిక ప్రళయాలకు, ఆంతరంగిక మహా విప్లవానికి అక్కడే నాంది ఏర్పడుతుంది. తన బాధ, తన గుండెల్ని కాల్చి వేస్తున్న బాధ.... చెప్పడం ప్రారంభించగానే 'వినడం' నుంచి ఎదుటి మనసు తప్పించుకోగానే ఆ 'తలపు' అర్థం అయ్యేటట్లు చెప్పాలనే 'చైతన్యద్వారం' మూసుకుపోతుంది. ఆపైన.... ఆపైన అంతా నాటకమే. ఏదో జరిగిపోతూ ఉంటుంది. ఏ అనుభవమూ మనసుదాకా వెళ్ళదు. మెదడు రికార్డ్ చెయ్యదు. అన్ని ఆనందాలు, దుఃఖాల్ను, జోక్స్, మీటింగులు పార్టీలు... అన్నీ ఉపరితలం మీద స్పర్శే. ఏదీ గుండె తడిని స్పృశించదు.

అదే జరిగింది జ్యోత్స్న విషయంలో. ఎప్పుడైతే తన బలగం. తనవాళ్ళు అనుకున్న ప్రతి ఒక్కరూ వాళ్ళకు నచ్చేవిధంగా తాను కనబడినంతసేపూ తనను ఉద్ధరించినట్లు మాట్లాడతారు కానీ, తనకు నిజంగా దుఃఖం, బాధ, అవసరం ఉన్నప్పుడు వీళ్ళెవరూ వీళ్ళ 'సేఫ్టీ సెల్స్' నుంచి బయటకు వచ్చి రక్షించరుగాక రక్షించరు. తాను తానుగా ఎవరికీ అక్కర్లేదు. -శాడిజం షాండ్లియర్‌గా, స్వార్థం కార్పెట్‌గా బతకాలి అని అర్థం అవగానే ఈ అక్కర్లేనితనం ఆమెలో కచ్చ, ఆవేశాలను నిద్ర లేపాయి.

ఆమె మానసికంగా చచ్చిపోవడం ప్రారంభించింది. ఆ మృత్యువు నీడ ఎవరికీ అర్థం కాదు. ఏ స్కానింగ్‌కూ దొరకదు. కాబట్టి మెల్లిగా డ్రింక్స్, డ్రగ్స్ – వీటి నీడలు ఆమెమీద పరచుకుంటున్నాయి.

ఒకరోజు భర్త గదిలో మరొక ఆడదాన్ని, అవకాశాలకు అమ్ముడుపోయే ఆడదాన్ని చూసినప్పుడు, "అదంటే నాకు అసహ్యం, దాన్ని రానియ్యకు" అని పెద్దగా రంకెలు వేస్తూ కారిడార్‌లో మొగుడుతో పోట్లాటకు దిగింది జ్యోత్స్న ఒక తెల్లవారుజామున.

అతను.... ఆమె భర్త.... ఆమెను కొట్టలేదు, తిట్టలేదు.

"అది ఎవరు అన్నది కాదు సమస్య. ఆ అమ్మాయి నాకు కావాలి. దానికి ఏం కావాలో నేనిచ్చి కొనుక్కోగలను." స్పష్టంగా గట్టిగా చెప్పాడు.

"అంటే.... నేను..... నేను" ఆవేశంగా మీదమీదికి వెళ్ళి అరుస్తోంది జ్యోత్స్న.

"అక్కర్లేదు" అని అతను స్పష్టం చెయ్యలేదు. కాని, "పడి ఉండు. అదీ పద్ధతి" అని అర్థవంతంగా చూస్తూ మెట్లు దిగాడు.

అతని వెనకే వంకర నవ్వుతో విజయగర్వంతో చూసి వెళుతున్న ఆ ఆడది. ఆమెకు వెండి గ్లాసులో మంచినీళ్ళు ఇస్తున్న అత్తగారూ, హోండా కారు తలుపు తీస్తున్న డ్రైవరు.

ఉడుకుబోతుతనంతో, నిస్సహాయంగా అక్కడ స్తంభానికి తలకాయ వేసి కొట్టుకుంటోంది జ్యోత్స్న. జుట్టు విరబోసుకుని బోరున ఏడుస్తున్న ఆమెను ఏహో చూపులు అంతఃతమస్సును చీల్చి స్పర్శిస్తున్నాయి నీరెండలా.

గబాల్ని చూసింది. పక్క కాంపౌండ్‌లో చేతులు కట్టుకుని నిలబడి సూటిగా చూస్తున్నాడతను. అతని చూపుల్లో ఓదార్పు, ఇంత పిచ్చిపిల్లవేమిటి అన్న మందలింపు.

అభిమానంతో గబాలున గదిలోకి పారిపోయింది అప్పటికి. 'ఎవరా వ్యక్తి' అని ఆరా తీసింది.

తన ఇంటి ఫర్నిచర్ ఖరీదు చెయ్యని ఆ మనిషి.... ఏవో కలలు కనే కథకుడు, ఏదో చేసెయ్యాలన్న ఆదర్శాల అర్భకుడు, ఎవరూ లక్ష్యపెట్టని, మూడు నెలలు అద్దె కట్టలేని పక్కింటి అవుట్ హౌస్‌లో ఉండే అమాయకుడు.

అతని పేరు సిద్ధార్థ. మరి ఏమిటిచ్చింది ఆ ధైర్యం? ఎలా చూశాడు తనని? ఎంత నిబ్బరం అతనిలో? ఏమిటి? ఏమిటిస్తుంది మనిషికి ఆ శక్తి?

కేవలం కుతూహలంతో అతణ్ణి పలకరించింది. తన దుఃఖం చెప్పి సానుభూతిని, తద్వారా అతని అభిమానాన్ని పొందాలని అనుకున్నది. వ్యాపారస్థుడి కూతురు ఆమె. కానీ, ఆమె స్నేహం తప్ప మిగతా అన్నీ అతను సున్నితంగా తృణీకరించాడు. అది ఆమెను మరింత ఆశ్చర్యపరిచింది.

అతను ఆమెకు తెలియని, అర్థం కాని చాలా చాలా విషయాలు చెప్పేవాడు. కానీ, ఆమె సంభాషణ ఎప్పుడూ తిరిగి తిరిగి తన బాధల దగ్గరే ఆగేది. అతను సహనంగా వినేవాడు.

"సాటి ఆడది కదా మా అత్తగారు, అంత ఘోరంగా...."

నవ్వాడు అతను.

"ఆవిడను, ఆమె భర్త, కొడుకు గౌరవిస్తారా?"

"నో, ఆవిడంటే పైసా విలువ లేదు. మా మామగారు చెయ్యెత్తుతారు కూడా. కానీ, నేను మాత్రం ఆవిడ మాట జవదాటకూడదని శాసిస్తారు. ఆవిడ నామీద రెచ్చిపోతుంది." ఆవేశంగా అన్నది జ్యోత్స్న.

"పుట్టు బానిసకు ఇంకొక కట్టుబానిసను తెచ్చి ఇస్తే ఆవిడ దానత్వం ఆవిడ మరిచిపోయి తన 'అధికారం' చెల్లుబడి అయిపోతోందనుకునే ఈ 'మాయ' చాలా గొప్పగా వివాహ వ్యవస్థను ఆవరించింది. ఆలోచించండి. ఆవిడ స్వతహాగా అంత చెడ్డవారై ఉండరు."

విన్నది జ్యోత్స్న. పరిశీలించడం ప్రారంభించింది. ఏ అభద్రతాభావం ఈ మనుషుల్ని తమ మనస్సుకు విరుద్ధమైన పనులు చేసే బానిసలుగా, ఆ తరువాత నియంతలుగా మారుస్తుంది? సంఘంలో చాలా 'గొప్ప ఫ్యామిలీలు'గా గౌరవించే బోలెడు ఇళ్ళు ఓటిగూళ్ళని, అందులో సుఖం నటిస్తున్న కుంటి చిలకల్ని గమనించింది. అతనితో చర్చించింది.

"అవమానించేవారు అవమానించబడేవారే... చిన్నప్పుడు బెల్టు దెబ్బలు తిన్న కొడుకు ఆ తరువాత శాడిస్టిక్ తండ్రి అవుతాడు. దరిద్రాన్ని, హింసను

అనుభవించిన వ్యక్తి తనకు డబ్బు రాగానే ఆ రెండింటితో బలహీనుణ్ణి బానిసను చేస్తాడు. ఈ మానసిక స్థితిలో బంధాలు, ప్రేమలు, బంధుత్వాలు అన్నీ ఓటిమాటలే. సంస్కారవంతుడే ఈ స్థితిని జయిస్తాడు. ఇలా ఆలోచించండి, మీకు చాలా అర్థమౌతాయి." చెప్పాడతను.

చాలా మారింది జ్యోత్స్న. చాలా చదివింది. ఇప్పుడు జ్యోత్స్న ప్రేమించ గలుగుతోంది. జాలి పడగలుగుతోంది.

పదిహేను రోజులు మంచం మీద ఉన్న అత్తగారికి చాలా సేవ చెయ్యగలిగింది జ్యోత్స్న. ఆమె బాధకు కన్నీరు కారుస్తున్న జ్యోత్స్నను గుండెలకు హత్తుకుని, "రవ్వలనగలు కొని పెడుతూనే నీచంగా చూస్తారు మనని. ఎక్కడికైనా వెళ్ళిపోమ్మా!" అని భోరుమన్నది అత్తగారు.

ఆశ్చర్యపోయింది జ్యోత్స్న. తన చుట్టూ, తనలో ఇంతవరకు ఎంత అజ్ఞానం? ఏమర్థమయ్యారు వీళ్ళంతా?

తల్లి మరింత అనారోగ్యంతో బాధపడుతోందని తన స్నేహితురాలు అయిన డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళింది.

"నీకు తెలుసా జ్యోత్స్నా! ఆడదాని ఎమోషన్స్, అణిచిపెట్టుకున్న ఆవేశాలు, దుఃఖాలు హార్మోన్సు మీద, యూట్రస్ మీద పని చేస్తాయి. మీ అమ్మగారి ప్రాబ్లం అదే. ఇంకమీదట అయినా ఆవిడ ఎలా ప్రవర్తించాలో, ఎంతవరకు మాట్లాడాలో మీ ఇంట్లోవాళ్ళు శాసించడం మానేసి, ఆవిడకు ఏది ఇష్టమో, ఏం చెయ్యదలచుకున్నదో తెలుసుకోండి" సలహా ఇచ్చింది డాక్టర్.

ఆలోచిస్తూ తల ఊపింది జ్యోత్స్న.

ఆ విషయం తండ్రితో, వదినెతో చర్చించబోయింది.

"అంటే? దానికి టెన్నిస్ అంటే ఇష్టం నలుగురుతో పోచుకోలు కబుర్లు చెప్పడం ఇష్టం వాళ్ళ పుట్టింటి వాళ్ళంటే ఇష్టం. చుడీదార్లు ఇష్టం ఇలా దానిష్టం వచ్చినట్లు చెయ్యమంటావా? నాన్సెన్స్. రోగమొస్తే ఎంత ఖరీదైన మందులైనా ఇప్పిస్తాను. కావాలంటే హాస్పిటలే కొంటాను. ఎందుకని? మిసెస్ సో అండ్ సో కాబట్టి. అంతే 'ఇలా తప్ప బతకలేను' అంటే చచ్చిపోయాక పాలరాతి సమాధి కట్టిస్తాను. ఇంత క్రూరంగా మాట్లాడుతున్నాననుకోకు. ఇలా చెప్తేకాని అర్థం కాదు." మాట్లాడుతున్న తండ్రి వంక చూసి కూర్చుండిపోయింది జ్యోత్స్న.

తల్లికి ఏది లేదో, ఏమిటి జబ్బో అర్థమైపోయి, ఇలా వివేకం నిద్రలేస్తున్నా, ఆ 'ఆడది' తన ఇంటికి రావడం ఆమెలో విషం కక్కిస్తూనే ఉన్నది.

"డబ్బుకు అమ్ముడుపోయేదానితో... రెస్టారెంటులో" కచ్చగా అన్నది అతనితో ఆమె డైమెండ్స్ చెక్కిన మంగళసూత్రాలు కరిగిపోతున్నాయి.

హిస్టీరికల్‌గా మాట్లాడుతున్న ఆమెను "మీరు అన్న ప్రశ్న రమీమని ఆపేసింది.

అంతే, ఆమెలో రాక్షసి నిద్ర లేచింది. ఫట్‌మని గ్లాస్ కింద పారేసి నానా తిట్లు తిట్టి, "కప్పు కాఫీకి కూడా గతి లేనివాడివి నన్ను ఇన్‌సల్ట్ చేస్తావా? నీ లెవెలెంత నువ్వెంత? నా లెవెల్‌కు నీ హామేమిటి" అని బిల్లు డబ్బు విసిరికొట్టి పోయింది.

ఆ తరువాత రెండు రోజులు బోలెడంత పశ్చాత్తాపపడి క్షమించమన్నది. తన ప్రవర్తనకు సంజాయిషీ ఇవ్వబోయింది. ఆమె లోపలి మనిషిని అబ్జర్వ్ చేస్తున్న అతనిలో రచయిత అవేవీ చూపించుకోలేదు.

"దరిద్రం కన్నా బాధించేవి చాలా ఉన్నాయని నాకు తెలుసు. అవేవో మీరూ తెలుసుకోండి. ప్రపంచం మీద బాంబులు వేసేవాళ్ళు, మనుషుల మీద ఆసిడ్ పోసేవాళ్ళు, కోడళ్ళను సజీవదహనం చేసేవాళ్ళు, యుద్ధాలు చేసేవాళ్ళు... వీళ్ళు ఆర్థిక దరిద్రంతో ఇవి చెయ్యరు. అవునా? ఆలోచించండి. వాళ్ళ దరిద్రం మరేదో! నా లేమిని కించపరిస్తే మీకు కలిగిన ఆనందం నిజమైనదేనా? మీ గురించి మీరు నిజం ఆలోచిస్తే నేనెందుకు ఆ 'మాట' మిమ్మల్ని అన్నానో అర్థమౌతుంది." చాలా బాలన్స్‌గా చెప్పాడు.

వీళ్ళ స్నేహం తెలిసిన భర్త, "వాడితో కావాలంటే సంబంధం పెట్టుకో, కానీ రొంపిలో దిగకు. నీకూ, నాకూ కూడా మంచిది కాదు" అని చక్కటి ఉచిత సలహా ఇచ్చాడు.

అవాక్కైపోయింది జ్యోత్స్న. తాను అమ్ముడుపోయానని అతను ఎందుకు అన్నాడో అర్థమైంది. ఏం పెట్టి వీళ్ళంతా తనని కొన్నారు? అని ఆలోచించింది.

సాంఘిక భద్రతా? పవిత్రతా? రక్షణా? తన ఆలోచనలతో సహా అమ్ముడుపోయినా ఇవేవీ దొరకవు. దొరికినట్లే ఉంటాయి. ఇది పై 'కప్పు లేనిఅద్దాల మేడ.' తన ప్రతిచర్యా ప్రపంచానికి కావాలి. కానీ, తనకు ప్రైవసీ ఉండదు.

"నాకు చాలా చాలా అర్థమౌతోంది. ఏం చెయ్యాలి ఇప్పుడు?" అడిగింది సిద్ధార్థను.

"మీరు ఆలోచించడం నేర్చుకున్నారు. అది గొప్ప పరిణామం. ఎవరూ ఎవరి సమస్యలకూ పరిష్కారం ఇవ్వరు. ఇవ్వకూడదు. ఇది మీ జీవితం. అనుభవం మీది. నిర్ణయం కూడా మీదే. డ్రింక్స్, డ్రగ్స్ ఎస్కేపిజమ్ ఇస్తాయి. దానివల్ల మీ ఇన్‌సెక్యూరిటీ తగ్గదు. మీకు ఏది సుఖమో మీకు అర్థమవ్వాలి" స్పష్టంగా చెప్పాడతను.

తలెత్తి చూసింది. హక్కులు తీసుకోని ఆ స్నేహానికి మనసుతోనే అభివందనం చెప్పింది ఆమె కళ్ళల్లో కృతజ్ఞతతో కూడిన మెరుపు.

తన తల్లిలా, 'ఖరీదైన అనారోగ్యంగా తాను తయారవలేదు. ఇలా ఉంటే అదే జరగబోయేది.

తన డాక్టర్ ఫ్రెండ్‌ను బతిమాలింది.

ఇంక పిల్లలు పుట్టరు కాబట్టి, ఆమె భర్త మరొక వివాహం చేసుకోవచ్చు అని సర్టిఫికెట్లు సృష్టించి, తండ్రికి ఆర్థికంగా నష్టం లేకుండా, మామగారికి, భర్తకు పరువు మర్యాదల బాధలేకుండా బోలెడంత సానుభూతితో, మంచితనంతో ఆ వలయంనుంచి బైటపడింది జ్యోత్స్న.

"ఇంత నాటకం అవసరమా? నేను మీతో బతకలేనని నిజం చెప్పచ్చుకదా?" అడిగింది స్నేహితురాలు.

"చెప్తే నన్ను చంపేస్తారు. ఆ పని మా నాన్నే చెయ్యచ్చు కూడా. వీళ్ళ కన్వీనియంట్ అవసరాల ప్రేమ అంతపని చెయ్యడానికి వెనుకాడదు. నేను నేనుగా కొద్దిరోజులు బతకాలనుకుంటున్నాను." స్పష్టంగా చెప్పింది స్నేహితురాలికి జ్యోత్స్న.

తాను ఒకప్పుడు డొనేషన్ పంపిన సిమ్లాస్కూల్లో టీచర్‌గా చేరింది.

ఈ జనం అందరికీ దూరంగా వెళ్ళిపోయింది.

"థ్యాంక్యూ మైడియర్ ఫ్రండ్!" అన్న కార్డ్ సిద్ధార్థ ముంగిట్లో... ఆమె వెళ్ళిపోయిన తరువాత.

❀ ❀ ❀

జ్యోత్స్న చంపబడలేదు. చచ్చిపోలేదు. వేటాడబడలేదు. పారిపోలేదు.... ఇవేవీ జరక్కుండా బతికిపోయింది.

ఆమె ఉత్తరం ఆ విషయం చెప్పింది రాంజీకి. "ఇందులో ఏది జరిగినా మన కుటుంబాలకు ఒకటే. నా ఫోటోకి దండ వేసి అన్న దానాలు చేసి, నా సమస్యను, జ్ఞాపకాన్ని సమాధి చేసేసి ఉండేవారు.

"కానీ.... కానీ, బతికిపోయాను. ఇది నువ్వన్నా గుర్తించు అన్నా!" ఆ ఉత్తరం నిండా తృప్తి. గొప్ప ఆలోచన.

రాంజీ కదిలిపోయాడు.

ఇంత డబ్బు, ఇంత హోదా.... ఏ సమస్యనైనా చిటికలో పరిష్కరించి అడ్డం వచ్చినవాణ్ణి వేటాడో, కొనేసో, సక్సెస్‌ను వరించే అలవాటైన తామందరూ చెయ్యలేనిదేదో "మనిషిని మనిషిగా బతకనివ్వడం...." జరిగిందది.

ఇది ఎవరివల్ల జరిగిందో, ఆ వ్యక్తి ఎవరో తెలుసుకుని కదిలిపోయాడు రాంజీ. ప్రతిక్షణం పోరాటం, స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్ జరుపుతున్న ఆ వ్యక్తి సిద్ధార్థ. తామందరూ చెయ్యలేనిదేదో అతను చేశాడు. తండ్రికి అర్థం కాదు. అందుకే తన పర్సనల్ ష్యూరిటీతో అతనిని నిలబెట్టాలనుకున్నాడు.

అందుకే సిద్ధార్థను పిలిపించాడు.

❀ ❀ ❀

స్క్రీన్‌ప్లే చెప్పాడు సిద్ధార్థ. అది జ్యోత్స్నలాంటి చాలామంది కథ. ఎవరికీ అర్థం కాని కథ. స్తబ్ధత. హృదయం లేనితనం. బతికినా, చచ్చినా ఒకటిగా చూసే ఈ

వ్యవస్థ ఏ కసాయి కత్తి ఎంత అందంగా తెలియకుండా జళిపిస్తూ బెదిరిస్తుందో చెప్పాడతను అర్థమయ్యేట్లు తన కథనంలో, దాని పరిణామం సంఘం మీద, పిల్లల మీద ఎంత ఘోరంగా ఉంటుందో, ఇటువంటి కొనుగోలు మనస్తత్వం నుంచి ఉద్భవించిన సంతతి మానసిక గతేమిటో చెప్పాడు.

తామెవరికీ అర్థం కానిది ఇతనికి .... ఇతనికి ఎలా అర్థమైంది? జ్ఞాననేత్రం అంటే ఇదేనా డైమెన్షనల్ షిఫ్ట్‌లో అర్థమవడమా?

తాను ఫైనాన్స్ చేస్తున్నానని చెప్పకుండా అది సిద్ధార్థ కథ అని చెప్పకుండా భార్యకు, తండ్రికి ఈ కథ వినిపించాడు. తల్లి వీల్‌ఛైర్‌లో కూర్చుని విన్నది.

"చాలా చాలా బావుంది ఈ కథ. కానీ, ఆ పిల్ల చచ్చిపోతే గొప్పగా ఉంటుంది. ఇంపాక్ట్ స్ట్రాంగ్‌గా ఉంటుంది" అన్నాడు తండ్రి.

"అవును రాంజీ! గొప్ప సింపతీ వస్తుంది" అన్నది భార్య.

"ఒద్దు.... ఒద్దు. బతకనీ..." ముద్ద మాటలతో అరిచింది తల్లి.

"చుప్... నువ్వు నోరుముయ్యి." అరిచాడు తండ్రి.

ఇంత చెప్పినా వీళ్ళెవరికీ అర్థం కాలేదా? కాదా?

పతితుల్ని, దీనులను, ఆర్తులను, దుఃఖితుల్ని గుండెలకు హత్తుకుంటున్న మదర్ థెరిసాను చూసి "మదర్! వీళ్ళంతా ఆర్థికంగా వెనకబడ్డవారిలోనే కాదు, మాలోనూ ఉన్నారు. మాకు, మా వర్గానికి కూడా మీరు కావాలి" అని ప్రార్థించిన అమెరికా ప్రెసిడెంట్ అర్థమయ్యాడు రాంజీకి ఆ క్షణంలో. కాపాడేవాడు ఎలా ఆలోచిస్తాడో సిద్ధార్థను చూస్తే అర్థమైంది.

మర్నాడు నిశ్శబ్దంగా చెక్కు సైన్ చేసి సిద్ధార్థకు అందించాడు.

"మీ సహాయానికి థ్యాంక్స్!" అన్నాడు సిద్ధార్థ మనఃస్ఫూర్తిగా.

"సహాయమా? ఎవరు ఎవరికి?" రాంజీ గొంతు పూడుకుపోయింది.

"మా కోసరం ఆలోచించి పెడుతున్న మీ సహాయం" సహాయానికి ఏంచేసి ఋణం తీర్చుకోగలం? అన్నాడు.

"రాంజీగారూ! జీవితం సినిమా కాదు ఎడిట్ చెయ్యడానికి. ముఖ్యంగా భావావేశాన్ని ఎడిట్ చెయ్యలేము. దుఃఖాన్ని, కోపాన్ని, ఇష్టాన్ని చెప్పలేని జీవితం ప్రేమను, ఆనందాన్ని కూడా చెప్పలేదు. రియాక్షన్ ఇవ్వలేదు. ఉంటే అన్ని భావాలూ ఉంటాయి. పోతే అన్నీ పోతాయి ఇలా అన్నీ పోగొట్టుకుని కావల్సిన ఎమోషన్ మాత్రం నటిస్తూ ఉంటే, మనిషి బతుకుతూ చస్తాడు. ఈ అయోమయాన్ని గుర్తించి బయటపడడం అందరికీ అవసరమే. సెలవు...."

నమస్కరించి వెళ్ళిపోయాడు గంభీరంగా సిద్ధార్థ.

('ఇండియా టుడే' - *2-2-1999*)